



కావేరమ్మపేట వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు



పగిలిన కిటికీ అద్దాలు



డబుల్‌బెడ్‌రూం ప్రాంగణంలో మద్యం సీసాలు



నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాలు



డబుల్‌బెడ్‌రూంల వద్ద దెబ్బతిన్న పైప్‌లైన్

‘డబుల్’ ఆశలు శిథిలం

- గృహప్రవేశం కూడా చేయకముందే దెబ్బతింటున్న ఇళ్లు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని కావేరమ్మపేట వద్ద నిర్మించిన 120 డబుల్‌బెడ్‌రూంలలో గృహప్రవేశాల కోసం లబ్ధిదారులు వేచిచూడక తప్పడం లేదు. 2023 జూలైలో అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి 120 మంది లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఎలాంటి వసతులు కల్పించలేదు. కరెంట్ కనెక్షన్లు ఇవ్వలేదు. స్తంభాలు పాతినప్పటికీ వైరింగ్ వేయలేదు. అలాగే నల్లా కనెక్షన్లు ఇవ్వకుండా ఉన్నారు. డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా కాల్వల పనులు చేపట్టలేదు. వీటికి తోడు మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొందరు ఇక్కడ ఉన్న పైపులను ఎత్తుకెళ్తున్నారు. కిటికీల అద్దాలు పగులగొడుతున్నారు. మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మార్చుకొంటున్నారు. దీంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే కొద్ది రోజుల్లోనే డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఎందుకూ పనిరాకుండా.. శిథిలావస్థకు చేరేలా ఉన్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలిచ్చిన.. గృహప్రవేశాలు కూడా చేయకుండానే తమ ఆశలు ఛిద్రమయ్యే పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చొరవ తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నోటు పుస్తకాల పంపిణీ



జడ్చర్ల టౌన్: ప్రేరణ మాధవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మారుతినగర్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రముఖ్ మంచన గుండెరావు, పుస్తకాల దాత జయపాల్‌రెడ్డి మాట్లాడారు. చిన్ననాటి నుంచే విద్య విలువతోపాటు నైతిక విలువలను పిల్లల్లో పెంపొందించాలన్నారు. వీహెచ్‌పీ ప్రముఖులు లావణ్య, నర్సింహులు, సాయిలు, లక్ష్మీనారాయణ, గోనెల రాధాకృష్ణ, మాస్టర్ కృష్ణలు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నరేష్



జడ్చర్ల టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడిగా గుండా నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ పెద్దలు ఆలంపల్లి మనోహర్, ముట్యాల రవీందర్, గుబ్బ బాలరాజు, మంచన పాండయ్య, దాచేపల్లి చంద్రయ్య, పాలాది రాంమోహన్, మేడిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ వాసికి డాక్టరేట్



హన్వాడ: మండలకేంద్రానికి చెందిన ఆంజనేయులు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా సాధించాడు. ఆయన రసాయన శాస్త్ర విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ లీలావతి పర్యవేక్షణలో 'వన్‌పాట్ మల్టీ కాంపోనెంట్ సింథసిస్ ఆఫ్ థయజోల్ ఫేతార్డ్ హెటిరో సైక్లిక్స్ అండ్ దేర్ బయాలాజికల్ ఎవాల్యుయేషన్' అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన నేపథ్యంలో మండలకేంద్రానికి చెందిన పలువురు, కేశవ్ మెమోరియల్ విద్యాసమితి ఆంజనేయులును అభినందించారు.

ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు



భూత్పూర్: బక్రీద్‌ను పురస్కరించుకుని ఆదివారం మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో ఈద్గాల వద్ద మజీద్ కమిటీ సభ్యులు పారిశుద్ధ్య పనులు చేయించారు. సోమవారం పండుగ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు వివరించారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు

జడ్చర్ల టౌన్: బక్రీద్ పురస్కరించుకుని సోమవారం ఉదయం 9గంటలకు బాదేపల్లి ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు జామైమసీద్ ఇమామ్ మహ్మద్ ఆరీఫోద్దీన్ ప్రకటించారు. ఈ మేరకు ముస్లీంలు ప్రార్థనలకోసం సమయానికే రావాలని కోరారు. వర్షం పడినట్లయితే ఆయా ప్రాంతాల్లోని మజీద్‌లలోనే ప్రార్థనలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆజం రైస్‌మిల్ ఎదురుగా ఉన్న మైమస్‌మజీద్‌లో ఉదయం 7గంటలకే ప్రత్యేక ప్రార్థనలు జరపనున్నట్లు మజీద్ ఇమామ్ తెలియజేశారు. బక్రీద్ వేడుకల్లో పాల్గొనాలనుకునే వారు ముందుగా ప్రార్థనలు చేయాలనుకుంటే హాజరు కావాలన్నారు. జడ్చర్ల ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఈద్గా, కావేరమ్మపేట మదర్సా, గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఉదయం 9గంటలకే ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రెమా చర్చిలో ఘనంగా ఫాదర్స్‌డే



పాస్టర్ జోయల్ బాబును సన్మానిస్తున్న సంఘ పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమా చర్చిలో ఆదివారం వరల్డ్ ఫాదర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ముఖ్య ప్రసంగికులు పాస్టర్ జోయల్‌బాబు మాట్లాడుతూ మనల్ని సృష్టించిన పరలోకపు తండ్రిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమాజం, కుటుంబానికి ఆదర్శంగా రాణించేందుకు ప్రతి తండ్రి కృషి చేయాలన్నారు. కుటుంబాన్ని చక్కబెట్టడంలో తండ్రి పాత్రే కీలకమని, అనుదినం దేవుని వాక్యాన్ని ధ్యానిస్తూ ఆయనకు ఇష్టులుగా ఉండాలని కోరారు. పిల్లల మంచి భవిష్యత్తు తీర్చిదిద్దేది తండ్రులేనని అన్నారు. పిల్లలు తండ్రుల పట్ల ఎనలేని గౌరవభావంతో మెలగాలని సూచించారు. సమాజంలో తండ్రుల పాత్రను తెలియజేయడానికే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఫాదర్స్‌డే వేడుకలు నిర్వహిస్తారని అన్నారు. అనంతరం తండ్రుల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ జోయల్‌బాబును ఘనంగా సన్మానించారు. సంఘ పెద్దలు దేవయ్య, అబ్రహం, శ్యాంసుందర్, భరత్, రామాంజనేయులు, బ్లాండీనా, బ్లెస్సీ, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



బోనాల వేడుకలో పాల్గొన్న మాజీ సర్పంచ్ శశికళారెడ్డి తదితరులు

రాజాపూర్: మండలపరిధిలోని రంగారెడ్డిగూడలో ఆదివారం బొడ్రాయి పండుగ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ చేపట్టారు. మహిళలు సుందరంగా తయారు చేసిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి, మాజీ సర్పంచ్ శశికళారెడ్డి వేడుకలో పాల్గొని పూజలు చేశారు.

సహపంక్తి భోజనాల ఏర్పాటు



సహపంక్తి భోజనం చేస్తున్న స్థానికులు

నవాబుపేట: తరుచు సహపంక్తి భోజనాలు చేయడం వల్ల మనుషుల్లో ఉన్న కల్మశాలు దూరమవుతాయని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారీ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో 1వ వార్డు ఎర్రసత్యం కాలనీలో జేకే ట్రస్టు ద్వార సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వార్డులో రెండు వర్గాల వారు ఘర్షణకు దిగిన నేపథ్యంలో వారికి సర్దిచెప్పి అందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధాకర్‌చారీ, విశ్వనేత్ర, డాక్టర్ ఆంజనేయులు, నిరంజన్, భాను, రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ చెంత జనజాతర





నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో ఆదివారం అడవి మొత్తం మార్మోగింది. సెలవు నేపథ్యంలో ఆలయానికి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పచ్చని చెట్లకింద విందులు చేసుకున్నారు.

మహిళ అదృశ్యం కేసునమోదు

భూత్పూర్: మున్సిపాలిటీకి చెందిన మహిళ అదృశ్యంపై పోలీసులు కేసునమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు లక్ష్మి, కృష్ణయ్య దంపతులు పట్టణంలో అద్దె ఇంట్లో ఉంటూ ఎల్ఈడీ బల్బులు విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 4 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా లక్ష్మి ఎక్కడికో వెళ్లిపోయింది. రాత్రివరకు ఇంటికి రాకపోగా ఆమె భర్త, బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆదివారం భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆదివారం కేసునమోదు చేసినట్లు రాజాపూర్ ఎస్ఐ రవి తెలిపారు. తమ సిబ్బంది సుదర్శన్, రామకృష్ణారెడ్డి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముదిరెడ్డిపల్లి శివారులో వాగు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ పట్టుబడిందన్నారు. విచారించగా ఎలాంటి అనుమతి లేదని తేలినట్లు వివరించారు. ట్రాక్టర్ డ్రైవర్ బోయ తిరుపతయ్యపై కేసునమోదు చేశామన్నారు.

మైసమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



భూత్పూర్: మున్సిపాలిటీలోని రాజీవ్ స్వగృహలో ఆదివారం నిర్వహించిన మైసమ్మ ఉత్సవాలల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా రాజీవ స్వగృహ కాలనీ ప్రజలు ఎమ్మెల్యేను శాలువా, బొకెలతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్ గౌడ్, లిక్కి విజయ్‌గౌడ్, ఆగిరి రవికుమార్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన



భూత్పూర్ సమీపంలోని రైతు పొలం వద్ద పరిశీలిస్తున్న తహసీల్దార్ పి.రాజు

భూత్పూర్: ధరణిలో పెండింగ్‌లో సమస్యలపై క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ పి. రాజు అన్నారు. అదేవిధంగా ఆదివారం తమ కార్యాలయంలో తహసీల్దార్ రాజుతో పాటు డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐ వెంకటేశ్, సిబ్బంది ధరణి సమస్యలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ధరణిలో శనివారం 233 మంది రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు రైతుల పొలాల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఉన్నతాధికారులకు వివరాలపై నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

త్రైతసిద్ధాంతం అమిత జ్ఞానాన్నిస్తుంది



నవాబుపేట: త్రైతసిద్ధాంతం ప్రతివ్యక్తికి అమిత జ్ఞానం అందిస్తుందని.. ఆ సిద్ధాంతం జ్ఞానవేదిక సమితి సభ్యుడు నాగ్యానాయక్ తెలిపారు. ఆదివారం సమితి ఆధ్వర్యంలో మండలకేంద్రంతోపాటు దరిపల్లిలో త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌లు, కిషోర్, తిరుపతయ్య, అమూల్య, కృష్ణయ్య, మోక్ష, అక్షర, విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆవరణలో లోపించిన పారిశుద్ధ్యం



ఏదులపూర్ పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు



తరగతి గదుల ఎదుట మురుగు

చిన్నచింతకుంట: ఏదులాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం లోపించింది. పాఠశాల తరగతి గదుల ఎదుట గ్రామ పంచాయతీ మంచినీటి ట్యాంక్ ఉండడంతో... నీరు లీకేజీ అయి చెత్తా చెదారం పడి మురుగుగా మారింది. పాఠశాలకు ప్రహరీ సైతం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తరగతి గదుల వెనుకభాగంలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. దీంతో పాఠశాల ఆవరణలోకి విష పురుగులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాక అమ్మఆదర్శ పాఠశాల కింద చేపట్టాల్సిన పనులు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. మండల కేంద్రానికి కిలో మీటర్ దూరంలో ఉన్న పాఠశాలపై అధికారులు దృష్టిసారించకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యాలు తీసుకోవాలని కోరుతున్నారు.

తాగునీటికి తప్పని తంటా

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో గత ఐదురోజులుగా తీవ్రంగా తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడం కూడా పెద్ద సమస్యగా మారింది. గతంలో వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి వాగునుంచి తాగునీటి పైపులైన్ వేసిన నిర్వహణ లోపంతో అవి కూడా సరఫరా కావడం లేదు. వర్షకాలం మొదలైన ఇంకా తాగునీటి కోసం తంటాలు తప్పడం లేదని, సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.



గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



నారాయణపేట రూరల్ : మండలంలోని జాజాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వోదయ గ్రామీణ గ్రంథాలయానికి పలు రకాల పుస్తకాలను బహుకరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న పాటూరు శ్రీనివాసులు, ప్రదీప్‌లు సుమారు రూ.లక్ష విలువ చేసే వారి సొంత డబ్బులతో 200 పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా సర్వోదయ గ్రంథాలయ నిర్వాహకులు డాక్టర్ ఆచార్య ఆవుటి జగదీష్ మాట్లాడుతూ.. యువత సమయం వృథా చేసుకోకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని, పాఠశాల, కళాశాలల విద్యార్థులు సైతం గ్రంథాలయానికి రావాలని కోరారు.

అదనంగా బస్సుసర్వీస్ వేయాలి

మరికల్: ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా మరికల్, ఆత్మకూర్ మధ్యన రాను పోను రెండు బస్సులు మాత్రమే నడిపించడంతో ప్రయాణికులు, పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులను నడిపించడంతో రాను, పోను ఈ రెండు బస్సులు మాత్రమే రాకపోకలను సాగించడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. ఈ సమయంలో ప్రైవేట్ వాహనాల్లో తరలి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నారాయణపేట డిపోనుంచి మరో రెండు బస్సులను అదనంగా వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలమయంగా గౌరిదేవిపల్లి రోడ్డు



అడ్డాకుల: మండలంలోని కందూర్ అనుబంధ గ్రామమైన గౌరిదేవిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. కొమిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి గౌరిదేవిపల్లి గ్రామం వరకు మట్టిరోడ్డే ఉంది. వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షం నీళ్లు నిలవడం వల్ల రోడ్డంతా బురదగా మారుతోంది. కొమిరెడ్డిపల్లి దాటిన తర్వాత పెద్దవాగులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వల్ల గ్రామస్తులకు వాగులో దారి కష్టాలు తొలిగిపోయాయి. అయితే మట్టిరోడ్డు మూలంగానే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు అదుపు తప్పే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి జాతీయ రహదారి నుంచి గౌరిదేవిపల్లి వరకు బీటీరోడ్డు వేయించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదభరితంగా మ్యాన్‌హోల్



జడ్చర్ల టౌన్: బాదేపల్లి మార్కెట్ యార్డుకు వెళ్లే దారిలో మ్యాన్‌హోల్ ప్రమాదభరితంగా మారింది. బాలిస్ట్రీట్ నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే రోడ్డుపై నిర్మించిన మ్యాన్‌హోల్ తెరుచుకుని ఉండటంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు సైతం నడుచుకుంటూ మ్యాన్‌హోల్ గమనించకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. మ్యాన్‌హోల్ వద్ద స్థానికులు రెండు రాళ్లను అడ్డుగా ఉంచినప్పటికీ దానిని గమనించకుండా వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంది. మ్యాన్‌హోల్ సమస్య ఏళ్ల తరబడి వేధిస్తున్నా అధికారులు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటి అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు జీరో బిల్లులు ఇవ్వాలి

మరికల్: మండలంలోని అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులను అమలు చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ తర్వాత అమలు చేసిన జీరో బిల్లును మండలంలో 50శాతం మందికి కూడా అమలు కాలేదన్నారు. కొందరికి మాత్రమే జీరో కరెంట్ బిల్లు అమలు కావడంతో మిగితా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి రావడంతో వారు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు
మా ప్రియమైన కస్టమర్లకు, అధికారులకు, మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు ప్రత్యేకించి మైనారిటీ సోదర సోదరీమణులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మరియు మా కస్టమర్లకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు...



Md. Mohmood
రుచికి... శుచికి నాణ్యతగల
Quadri Hotel Veg & Non-Veg
Ashok Talkies X Road, Mahbubnagar - 509001. Telangana

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com